

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పి.సాయిబాబా తదితరులు

## ఎన్టీఆర్ హయాంలోనే బడుగుల సంక్షేమం

**రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి ఏపీ సీఎంగా ఎన్టీఆర్ ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమానికి పునాదులు పడ్డాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. ఎన్టీఆర్ సీఎంగా 1983 జనవరి 9న ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నాటికి 41 ఏళ్ల పూర్తి కావడంతో దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన విగ్రహానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే భారతదేశంలో సంక్షేమ రాజ్యానికి నిర్వచనం చెప్పారని అన్నారు. దేశంలోనే తొలిసారిగా రూ. 2 కే కిలో బియ్యం, మద్యపాన నిషేధం వంటి సంక్షేమ పథకాలకు స్వీకారం చుట్టిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, శ్రీపతిసతీష్, శ్రీనివాస్‌నాయుడు, ఎస్.ప్రకాష్, జి.యాదగిరిరావు, భవాని శ్రీనివాస్, ఓ.వెంకటేష్‌చౌదరి, కిరణ్, భానుప్రకాష్, సత్యనారాయణ, ఖలీల్ పాల్గొన్నారు.

## ఆహార కల్తీ నివారణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న వినయ్‌కిషోర్‌యాదవ్

**బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** ఆహార కల్తీలను నిషేధించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వాభిమాన్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కిషోర్‌యాదవ్ డిమాండ్ చేశారు. కల్తీరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశా రు. మంగళవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 19 నగరాలలో కల్తీ ఆహారపదార్థాలపై 291 కేసులు నమోదు కాగా ఇందులో 246 కేసులు హైదరాబాద్‌లోనే నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు సిరిగిరి ప్రభాకర్, పి.ప్రమోద్, రాజేష్, వెంకటేష్, అనూప్ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆటో సంఘాల నాయకులు

**బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ కౌశల్‌సమీర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ నాయకులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేకేసీ వైస్ చైర్మన్ వేణు, ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి, ఆటో విభాగం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

## అత్యధిక ఎంపీ సీట్లు గెలుస్తాం



డా.లక్ష్మణ్‌ను అభినందిస్తున్న ఎండీ మహమూద్

**చిక్కడపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి):** రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుస్తుందని ఎంపీ డా. కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను మైనార్టీ మోర్చా రాష్ట్ర కన్వీనర్ (వక్ఫ్‌బోర్డ్) ఎండి మహమూద్ సన్మానించారు. పార్టీ నేతలు రమేష్‌రామ్,రాజుగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సి.కృష్ణాయాదవ్, ఎన్.గౌతమ్‌రావు తదితరులు

## మోదీ సారథ్యంలోనే ప్రజా సంక్షేమం సాధ్యం

**నల్లకుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** ప్రధాని మోదీ సారథ్యంలోనే దేశ సమగ్రత, ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో కేంద్ర పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలతో కూడిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్, ఎడెల్లి అజయ్‌కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

## శ్రీనివాస్ మృతి పట్ల పద్మశాలి నేతల సంతాపం

**ముషీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** పద్మశాలి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ మృతి పద్మశాలిలకు తీరనిలోటు అని భోలక్‌పూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, నాయకులు బల్ల ప్రశాంత్, మార్గం అమర్‌కుమార్ అన్నారు. మంగళవారం రామ శ్రీనివాస్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహస్థాపన కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాల సాధన కోసం తమవంతు కృషి చేస్తామని వారన్నారు. ఆయన మృతి పట్ల ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు అతినగరం సుధేష్ సంతాపం వ్యక్తం చేశారు.

## లచ్చిరెడ్డికి సన్మానం



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న సాధన సమితి చైర్మన్ ఆర్ విజయ్ తదితరులు

**కవాడిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** సీఎంఆర్‌వో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా (సీసీఎల్ఏ) బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి లచ్చిరెడ్డిని మంగళవారం వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా విజయ్ మాట్లాడుతూ.. రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిన సందర్భంలో రెవెన్యూ వ్యవస్థపై పూర్తి పట్టు ఉన్న లచ్చిరెడ్డికి సీసీఎల్ఏ డైరెక్టర్ పదవి అప్పగించడం శుభపరిణామమని, తద్వారా రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి సీఎం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. సత్యనారాయణ, సతీష్, చిరంజీవి, అశోక్, శివరాం పాల్గొన్నారు.

## రాధిక మంగిపూడిది ఆత్మీయతతో కూడిన సాహిత్యం



రాధిక మంగిపూడిని సన్మానిస్తున్న ఇనాక్

**చిక్కడపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి):** రాధిక మంగిపూడి రచనలు అనుభూతి, ఆత్మీయతతో కూడి మానవతా విలువలు పంచేవిగా ఉంటాయని వేంకటేశ్వర యూనివర్శిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రాధిక రచనలు కనిపిస్తాయని వివరించారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నెలనెలా తెలుగు వెన్నెల 178వ కార్యక్రమంలో భాగంగా రాధిక మంగిపూడి రచనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇనాక్ పాల్గొని రాధికను సన్మానించారు. అధ్యక్షత వహించిన వంశీ రామరాజు మాట్లాడుతూ మార్చి నెలలో అఖిల భారత సాహితీ సదస్సులు కాకినాడలో వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆచార్య గౌరీశంకర్, డా.వడ్డేపల్లి కృష్ణ, జర్నలిస్ట్ శంకరనారాయణ, రచయిత్రి తిరునగరి దేవకిదేవి రాధిక రచనలు వివరించారు.

# ఎన్టీఆర్ స్టేడియాన్ని పట్టించుకోరా..

### గేట్లు కూడా లేవు



ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తా చెదారం

- ఎక్కడ చూసినా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు
- అక్రమ పార్కింగ్.. అసాంఘిక కార్యక్రమాలు

**జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, పోలీసు అధికారుల ఉదాసీన వైఖరితో నగరంలో ప్రసిద్ధిగాంచిన ఎన్టీఆర్ స్టేడియం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో స్టేడియంలో ఎక్కడ చూసినా భవన నిర్మాణ వ్యర్థాల కుప్పలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా రాత్రి సమయాల్లో స్టేడియంలోకి తాగుబోతులు, యాచకులు వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.**

**కవాడిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** ఇందిరాపార్కు ఎదురుగా ఖాళీ స్థలంలో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో యువత క్రీడల కోసం, ఆధ్యాత్మిక, సభలు, సమావేశాల కోసం అప్పటి సీఎం నారాచంద్రబాబునాయుడు ఎన్టీఆర్ స్టేడియం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆ సమయంలో ఎన్టీఆర్ స్టేడియంకు ఉన్న ప్రధాన ద్వారాల వద్ద, సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించే వారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జీహెచ్ఎంసీ విభాగం నుంచి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ పరిధిలోకి మార్చడంతో పాటు ఎన్టీఆర్ స్టేడియంలో కళాభారతి భవనం నిర్మించేందుకు అధికారులు నిర్ణయించడంతో అప్పటి నుంచి ఎన్టీఆర్ స్టేడియం ఆలనా పాలన కరువై రక్షణ లేకుండా పోయింది.

**అదనంగా ఐదు దారులు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల ఆత్మగౌరవ సభ పేరుతో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగసభ కోసం స్టేడియానికి ఉన్న ఆరు ప్రధాన గేట్లకు అదనంగా మరో ఐదు దారులు ఏర్పాటు చేసేందుకు ప్రహరీ కూల్చారు. సభ ముగిసిన తరువాత ఆ దారులను మూసి వేయలేదు. కనీసం గేట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో చుట్టుపక్కల వారు ఇంటి నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తీసుకొచ్చి ఎన్టీఆర్ స్టేడియంలో డంప్ చేస్తున్నారు. దీంతో స్టేడియం ఎక్కడ చూసినా మట్టికుప్పలు, చెత్తాచెదారం దర్శనమిస్తోంది.



ఎన్టీఆర్ స్టేడియంలో పార్కు చేసిన వాహనాలు

**అసాంఘిక కార్యక్రమాలు..**

ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం మాత్రమే.. సందర్శకులు, క్రీడాకారులు వ్యాయామం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో స్టేడియంలో డీసీఎం, ఆటోలు, కార్లు వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి ఆరు దాటితే చాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎన్టీఆర్ స్టేడియంలోకి వచ్చి మద్యం తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. కొన్నిసార్లు గొడవలు జరిగి పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులు నమోదైన సంఘనలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోతున్న మట్టికుప్పలపై ఫిర్యాదుచేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్టీఆర్ స్టేడియానికి గేట్లు ఏర్పాటు చేసి సెక్యూరిటీ ఏర్పాటు చేసి స్టేడియంలోకి వాహనాలు, మందుబాబులు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు, క్రీడాకారులు కోరుతున్నారు.



మాజీ సీఎం కేసీఆర్ సభ సందర్భంగా ఏర్పాటు చేసిన ద్వారం వద్దగేటు లేని దృశ్యం

### రాత్రి 10.30 గంటల తరువాత ఎవరూ ఉండొద్దు



ఎన్టీఆర్ స్టేడియంలో పెట్రోలింగ్ పెంచి తాగుబోతులు, గొడవలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేసే వారికి అవగాహన కల్పిస్తాం. అప్పటికీ వారు స్పందించకపోతే చర్యలు తీసుకుంటాం. రోజూ రాత్రి 10.30 గంటల తరువాత ఎన్టీఆర్ స్టేడియంలో ఎవరూ ఉండకుండా ఖాళీ చేయిస్తాం.

– సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దోమలగూడ

### స్టేడియంలో మట్టి, చెత్తవేసే వారిపై చర్యలు



ఎన్టీఆర్ స్టేడియంలో ఎవరూ చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. వీరిపై చర్యలు తీసుకునేందుకు నిఘా పెడతాం.

– తిప్పర్తి యాదయ్య, ముషీరాబాద్ సర్కిల్ 15 డీఎంసీ

## అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫలితాలు ప్రకటించాలి



ధర్నాలో ఏఈఈ మెరిట్ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు

**కవాడిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** గత సంవత్సరం జనవరిలో నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్ష ఫలితాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేసి రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ఏఈఈ మెరిట్ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు అఖిల ప్రియ, పవన్, సుమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద ఏఈఈ, ఏఈ, జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ తదితర పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పరీక్ష రాసిన అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐఐటీ, ఓయూ, జేఎన్‌టీయూ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి గత ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా 2022 సెప్టెంబర్‌లో రాసిన పరీక్షలు పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేశారని వాపోయారు. మే 2023లో ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పరీక్షలను రాశామని తెలిపారు. సెప్టెంబర్‌లో ప్రకటించిన మెరిట్‌లిస్టులో ప్రకారం ఫలితాలు విడుదల చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీకి నూతన బోర్డును నియమించి నియామకాలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ ధర్నాలో సంఘం ప్రతినిధులు అఖిల్‌కుమార్, పవన్‌కుమార్, పృథ్వీరాజ్‌తో పాటు అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అంబర్‌పేట అధ్యక్షుడి నియామకం





సాయిమణీష్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్

**రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడుగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ కుమ్మరివాడికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కుంకుమ సాయిమణీష్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ మిద్దెల జితేందర్ ప్రకటించి మంగళవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిమణీష్ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం అంకితభావంతో అందించిన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా అంబర్‌పేటలో పార్టీ సేవాదళ్‌ను పటిష్ఠం చేస్తానన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ● ఎమ్మెల్యే కాలేరు మానవత్వం



కొన్నేళ్లుగా పేదల దహన సంస్కారాలకు అయ్యే ఖర్చును ప్రతినెలా శ్మశానవాటిక నిర్వాహకులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేస్తూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు. దీనిలో భాగంగా మంగళవారం తన నివాసంలో గోల్నాక డివిజన్ హర్రాస్‌పెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో డిసెంబర్‌లో పేదల దహన సంస్కారాలకు అయిన ఖర్చు 1 లక్షా 57 వేల రూపాయలు ఎమ్మెల్యే వెంకటేష్ శ్మశానవాటిక నిర్వాహకులకు అందజేశారు.

– గోల్నాక, ఆంధ్రజ్యోతి



లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ, కళా జనార్దనమూర్తి, తదితరులు

## బ్రెయిలీ జీవితం అందరికీ ప్రేరణ

**చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** అంధులకు ఒక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికి ప్రేరణ ఇస్తుందని సీబీఐ న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగమారుతీ శర్మ మాట్లాడుతూ అంధులు చదువుకు దూరం అవుతున్నారన్న వేదనతో బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి ఆశాజ్యోతిగా వారి జీవితాలను వెలుగుమయం చేశారని అన్నారు. పరులకోసం పాటుపడే నిత్య స్మరణీయులు అని అన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు ఏం చేశారో ప్రధాని చెప్పాలి

**జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్**



మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య, శ్రీనివాస్‌గౌడ్

**బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** పదేళ్లలో బీసీలకు ఏం చేశారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని వారు ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. డాక్టర్ విజయభాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

## నేషనల్ కర్లింగ్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు



పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు

**బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** జమ్మూ కశ్మీర్‌లో జరిగిన 3వ నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.సురేష్, ప్రధాన కార్యదర్శి వి.వసంత మాధురి తెలిపారు. 18 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని వారు తెలిపారు. మిక్స్‌డ్, డబుల్స్‌లో రాష్ట్రానికి చెందిన బి.ఎం.పవన్‌కుమార్, నాగఅక్షయ బంగారు పతకాలు సాధించారని, మిక్స్‌డ్ టీమ్‌లో ఎం.నర్సింహరెడ్డి, జి.కృష్ణమూర్తి, ఎ.రాకేష్, ఎం.లక్ష్మీచైతన్య కాంస్య పతకాలు సాధించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను డాక్టర్ రష్మీసలూజా సత్కరించారు. కార్యక్రమంలో మహ్మద్ అర్షద్, మహ్మద్ డ్యానిష్ తదితరులు పాల్గొన్నారు.

### కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(5వ పేజీ తరువాయి)

ఫెస్టివల్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు తమ ఇంట్లోనే తయారుచేసిన 400 రకాల స్వీట్లతో పాటు తెలంగాణ వంటకాలను ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ఫుడ్ కోర్టులో విక్రయిస్తారని చెప్పారు. వీక్షకులను ఆకట్టుకునేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. శైలజారామయ్యర్‌తో పాటు పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, క్లిక్ సంస్థ ప్రతినిధులు బెంజిమిన్, అభిజిత్, ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్ పవన్ సోలంకీ పాల్గొన్నారు.



బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో 2024 సంవత్సర క్యాలెండర్‌ను యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి నేతృత్వంలో మాజీమంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. పి.నర్సింగ్‌రావు, ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. – కవాడిగూడ

### ● శ్రీరాముడి పాదుకలకు గవర్నర్ పూజలు



హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అయోధ్య రామమందిరానికి కానుకగా ఇచ్చేందుకు తయారు చేయించిన బంగారు పాదుకలకు గవర్నర్ డా.తమిళిసై సౌందరరాజన్ ప్రత్యేక పూజలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులతో పాటు రాజ్‌భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

– హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి)

## టీజేసీపీడీఏ కార్యవర్గం ఎన్నిక



లక్ష్మయ్య, పర్వతాలుగౌడ్

**బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర జూనియర్ కాలేజెస్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీజేసీపీడీఏ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఎల్బీ స్టేడియంలోని ఒలంపిక్ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బి.లక్ష్మయ్య (హైదరాబాద్), ప్రధాన కార్యదర్శిగా ఎం.పర్వతాలుగౌడ్ (హైదరాబాద్) ఎన్నికయ్యారు. కోశాధికారిగా జి.అన్నామేరి (హైదరాబాద్), ఉపాధ్యక్షుడిగా పి.పాపిరెడ్డి (మహబూబ్‌నగర్), పి.సురేష్‌కుమార్ (హైదరాబాద్), బి.బాబురావు (ఆదిలాబాద్), లాలునాయక్ (రంగారెడ్డి) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎం.ఈశ్వర్ (హైదరాబాద్), డాక్టర్ కె.సతీష్‌కుమార్ (వరంగల్), జి.జగన్‌మోహన్ (మేడ్చల్ మల్కాజిగిరి), ఎం.సమ్మయ్య (మెదక్), ఎం.గంగాధర్ (నిజామాబాద్), జి.మధుజాన్సన్ (కరీంనగర్), మహిళా కార్యదర్శిగా డాక్టర్ కె.ఉమారావు (హైదరాబాద్), కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ వాదిరాజ్ (రంగారెడ్డి) ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎస్.సోమేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జె.వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, స్నేహరెడ్డి, పి.జక్కయ్య, డాక్టర్ గోపి తదితరులు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

### ● శ్రీరాముడి అక్షింతల పంపిణీ



కవాడిగూడ డివిజన్ దోమలగూడ వినాయక్‌నగర్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పి పరశురాం ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రేమ్‌కుమార్, సుదాన్షు, ఈశ్వర్, కిషోర్, శివ, స్థానికులు పాల్గొన్నారు.

– కవాడిగూడ, ఆంధ్రజ్యోతి